# పరిత్యక్త

ఎప్పుడో? చుక్క తెగిపడ్డట్టుగా మేం ఇద్దరం కలిసి సినిమాకు వెళ్లే అవకాశం దొరుకుతుంది. అంతటి అవకాశాన్ని అడక్కుండానే కల్పించింది. 'డుయెల్ పర్సనాలిటీ' అనే యింగ్లీషు సినిమా. అది డ్రీమ్‌లాండులో వుంది. నారాయణగూడా నుండి బస్సు ఎక్కిపోయి ఫస్ట్‌షో చూచి యింటికి తిరిగి వచ్చేవరకు పదిన్నర దాటింది.

లేక లేక కడప దాటి కదిలినందుకు కోపమో? సంబరమో? కానీ వర్షం జోరుగా కురవడం ప్రారంభించింది. పెళ్లైన కొత్త రోజులు కాబట్టి వానలో తడవటం కూడా వో తీరు వుల్లాసాన్నే కలిగించింది. ఏమైతేనేం ఇద్దరం నవ్వుకుంటూ పరుగెత్తినట్లుగా నడుస్తూ ఇల్లు చేరాం బస్ స్టేజినుండి.

ఇంటి లోపల అంటే పోర్టికోలాంటి ప్రదేశంలో కాలు పెట్టగానే అక్కడ ఎవ్వరో వ్యక్తి ముసుగు తన్ని పడుకున్నట్లనిపించింది. అప్పటికి మాకు కారులేదు; బేకారుగానే వున్నాం, కానీ ఇకముందు ముందు మాది ఆర్ట్ మ్యూజియం కాబోతుంది. ఎన్నో ఎన్నెన్నో వుత్సవాలు జరుగుతాయి. జనం ప్రదర్శన చూట్టానికి తండోపతండాలుగా వస్తారు. ఇది కళా నిలయమా? మజాకా? అంటూ మావారు మేన్ ఎంట్రెన్స్ చాల పెద్దదిగా పెట్టించారు. వైరుతో వెల్డింగ్ చేసిన నృత్య భంగిమలతో వున్న స్త్రీ మూర్తులు అలంకరించిన ఆరు తలుపులు వుండాలనే కోరికతో వుంచిన ద్వారం అది. పాపం చేతిలో సరిపడే డబ్బులేక తెరిచే వుంచిన పెద్ద హాలు వంటి ముంగిలి అది.

ఆ చీకట్లో అలా ముసుగుతన్ని నిద్రిస్తున్న వ్యక్తి ఎవరో? పోల్చుకోటానికి వీలు లేకండా పోయింది. వూపుగా ప్రవేశించిన నేను ఆ ముసుగు చూసి రెండడుగులు వెనక్కి తగ్గి మావారి సరసన చేరాను. మావారు కొంచెం ముందకు వెళ్లి ' ఏవరు? నీవు? అంటూ గట్టిగా పిలిచారు. రెండు మూడు పర్యాయాలు పిలిచిన తరువాత ముసుగులోని మనిషి ఆఁ అంటూ ముసుగు తీసింది. కారు చీకట్లో పోల్చుకోలేకపోయినా మూల్గును బట్టి అక్కడ ముసుగులో వున్న వ్యక్తి పురుషుడు కాదు, స్త్రీ అంటూ తేలిపోయింది. ఇంతలోకే,

యింతవరకు మొండికేసి మొరాయించిన విద్యుద్దీపాలు వొక్కసారి జిగేలుమంటూ మెరిశాయి. ఆ వెలుతురులో ఆమె 'స్త్రీ' అంటూ స్పష్టంగా కనిపించింది.

'ఓ మహాతల్లి! ఎవరు నీవు? ఈ రాత్రి ఇక్కడేం జేస్తున్నావ్? అంటూ ప్రశ్నించిన ప్రతి మాటకూ సమాధానంగా కిలకిలా నవ్వుతూ పడుకుందే తప్ప వొక్క మాటైనా పలకలేదు. వయసు పాతికేళ్లుండవచ్చు. ఒత్తుగా నల్లగా పెరిగి వుంగరాలు తిరిగిన వెంట్రుకలు కళ్లను కప్పుతూ రెండువైపులా కదలాడుతున్నాయి. విశాలమైన ముఖంలో కాంతివిహీనమైన రెండు నల్లటి కళ్లు ఆకర్ణాంతాలై ఉన్నాయి. సంస్కారవిహీనమైన శరీరంలో బట్టలున్నాయో లేవో? తెలియదు. ఆ స్థితిలో వున్న తోటి స్త్రీని చూసి వెళ్లిపో అంటున్న మా వారిని ఆపుతూ ఉండనీయండి అంటూ నేను లోపలికి నడిచాను. నిజానికి వెళ్లిపొమ్మంటూ ఆమెను బలాత్కరించినా అర్థం చేసుకునే స్థితిలో లేదు ఆ వ్యక్తి అప్పుడు. ఇలాంటి వాళ్లను చూస్తే నీకు ఆదరణ ఎక్కువ నీ యిష్టం అంటూ నాతో కలిసి మావారు యింటి లోపలికి నడిచారు. దాని ఖర్మకు దాన్ని వదిలేసి మేం దాని మాటే మరచిపోయాం. అది ఎప్పుడు ఏ రాత్రి వెళ్లిందో? కూడా తెలియదు.

ఈ సంఘటన తర్వాత ఓ సంవత్సరం గడిచి ఉంటుంది. ఇంకా చార్లో తాలింపైనా పెట్టలేదు. సెలవన్న మాటేకాని ఊపిరి తీసుకోడానికి కూడా వీలుండని రోజది. దోభీకి ఈనాడే తీరిక ఇస్త్రీ బట్టలంటూ రావటానికి, పని మనిషికి కూడా ఈ పొద్దుటే విమ్ అయిపోతుంది. ఇల్లు తుడవడానికి చీపురుండదు. లేదా, కడుపులో నొప్పంటూ డుమ్మా కొడుతుంది. దీనికి తోడు మా పిల్లకి ఈ రోజే మైసూర్‌పాకు తినాలని కోరిక విపరీతంగా పుట్టింది. ఇప్పుడే ప్రెస్ యజమాని నౌకరు ప్రూఫ్ తీసుకుని వచ్చి అమ్మా! తొందరగా సరిచూసి ఇవ్వండంటూ తొందర పెడుతున్నాడు.

ఇన్నిటికి తోడు మా ఆర్టిస్టు దొర బొమ్మ చెక్కుతూ చెక్కుతూ కన్నెత్తకుండానే యశోదా! తేరా దివానా సైగల్ 'దో నైనా' వస్తాంది విందువురా! అంటూ అనురాగాన్నంతటినీ ఒలకబోస్తూ రసికతను ప్రదర్శిస్తున్నారు. నిజమే! ఆ పాటంటే నాకు చాలా ఇష్టం. ఎంత దుంకుడు పంతులైనా తను గీస్తున్న బొమ్మే తనకు సర్వస్వమైనా? నా సెంటిమెంటును ఆ మాత్రం గౌరవిస్తున్నందుకు నా జీవితం ధన్యత్వాన్ని స్వీకరించింది అనుకొన్నాను. ఇంతలోకే గ్యాస్‌స్టౌ పై పెట్టిన కుక్కర్ విషయం మరచి పోయాను. బర్నర్ వేడికి ఎగిరిపోతున్న వెయిట్‌ను సంభాళించలేక ఓ దిక్కు సతమతమవుతూ వుంటే మరో దిక్కునుండి పిల్లలు

'అమ్మా! అమ్మా! అత్తా అత్తా! ఇక్కడ రామ్మా, వచ్చి చూడత్తా అంటూ పెడుతున్న గావు కేకలు వినిపించాయి. ఆ కేకలకు అరికాలి మంట నెత్తికెక్కింది. పైకి చెక్కిన కుచ్చిళ్లయినా సరిచేసుకోకుండా చెరాచెరా నడుస్తూ ఇవతలికి వచ్చి ఎందుకీ కేకలూ? అరుపులూ? ఏమంటుకుందని? ఎవరి కొంపలు మునిగిపోతున్నాయని? అంటూ రుసరుసలాడాను.

నా కోపం చూసి మా పిల్ల బల్లిలా అణిగింది. కాని నా మేనకోడలు. 'అత్తా పాపం పిచ్చిదత్తా! అంటూ వుంటే మా అమ్మాయి ధైర్యాన్ని పుంజుకుని అమ్మా! ఔనమ్మా!

పిచ్చిదాని బిడ్డ ముద్దుగా వుందమ్మా, మాద్దువుగాని రామ్మా అంటూ నా చేయిపట్టి లాగుతూ గారాలు పోయింది.

మేమంతా కలిసి గేటు దగ్గరికి పోయే వరకు ఎదుట ఒక ఆలివ్ గ్రీన్ ఫియట్ కారు నిలిచి వుంది. ఆ కారు ఓనరు కాబోలు, కారు దిగి, ఛీ! దిక్కుమాలిన పిచ్చిముండ! కారంతా డర్టీ చేసింది. దాని గుడ్డపేలికలు తెచ్చి డోర్ కర్టన్స్‌లా వ్రేలాడ దీసింది. దీని అబ్బ సొమ్మా తాత జాగీరో? అనుకుంది. అంతేకాదు దీని బిడ్డను కూడా తెచ్చి కార్లో కూచోబెట్టింది. ఇంకా నయం త్వరగా వచ్చిచూసుకున్నాను. లేకపోతే ఈ పిల్ల నా కార్లో క్యావ్ క్యావ్ అంటూ వుంటే పోలీస్ స్టేషన్స్‌కు తిరగలేక చచ్చేవాణ్ణి, అంటూ దురుసుగా మాట్లాడుతూ అసహ్యించుకుంటూ కార్ స్టార్ట్ చేసి పోబోతున్నాడు.

పిచ్చిది పాం ఆ! ఊ! ఏదీ లేక పోతబోసిన బొమ్మతీరు ఏ కదలికా లేకుండా నిలబడి రెండు కండ్లప్పగించి చూస్తుంది. కాళ్ల దగ్గిర పారేసిన బిడ్డ క్యావు, క్యావు మంటూనే ఉంది. ఇంతలోకే కారు చుట్టూ నలుగురూ పోగయ్యారు.

అలా పోగైన నలుగురూ సంగతి విన్నారు. కారు యజమానిని 'ఏం జరిగింది సార్!' అంటూ గౌరవంగా ప్రశ్నించి ఆ వ్యక్తి చెప్పిన బొంకు విని అతణ్ణి పోనిచ్చారు. ఆ సంగతి విన్న నలుగురూ 'పిచ్చి ముండకు కూడా కారు మీద కన్నే' డబ్బంటే పిచ్చి పేలికలే కాదు, కాటిలో వున్న శవం కూడా లేచి వస్తుంది. ఇదో కొత్త వేషం. ఛీ! ఛీ! ఈ న్యూసెన్స్ అంతా ఈ దౌర్భాగ్యపు దేశంలోనే! పనీపాట లేకపోతే సరి! అంటూ కొందరంటూంటే మరో కొందరు 'అయ్యో రాత, తల్లీ నీకూ మొగుడు కావలసి వచ్చాడా?' అన్నారు.

మరికొందరు పాపం! ఎవడో దీన్ని అనుగ్రహించి పుణ్యం కట్టుకున్నవాడు గొప్పవాడయ్యుంటాడు. పసిపిల్ల అందంగా వుంది అన్నారు.

కొందరు స్త్రీలు ముక్కు మీద వేలేసుకొని వెటకారంగా 'తిక్కముండ సామాన్యురాలు కాదు, ఎన్ని ఎలుకలు తిన్న పిల్లో? అంటూ అనుభవాన్నంతా గుమ్మరించారు. నడి వయస్కురాలొకామె సక్కనిదేనండీ బాబూ! బాగా బతికినట్లే వుంది. ఖర్మ! ఏం చేద్దాం' అంది.

ఇంతలోకే మరొక్క స్త్రీ అందుకొని ఏం బ్రతుకు? బ్రతుకైనా ఎంగిలి విస్తరి మళ్లా వడ్డనకు అక్కరకు రాదు కదా! అన్నది - వీళ్లిట్లా మాట్లాడుకుంటూ వుంటే యువతరంలో జులాయిగాళ్లు చేరి' ఏరా, ఎగాదిగా చూస్తున్నావు దాన్ని, ఇరాదా క్యాహై! అంటూ చాలా నీచంగా తానేదో జోక్ చేస్తున్నట్లు అంటూ పండ్లిగిలించాడు. అంతలో ఒక నిజాయితీపరుడు ఛీ! నోర్ముయ్! ఎవరి గతి ఎట్లుందో? నీకూ తోడబుట్టువులున్నారు కదా! స్త్రీని గూర్చి అంత నీచంగా మాట్లాడకు కొంత సభ్యత నేర్చుకో' అన్నాడు. దీంతో అందరి నోర్లూ కట్టుబడి నిజమైన స్థితిని గూర్చి ఆలోచించసాగాయి. అప్పుడు గాని ఒక ఆలోచన తళుక్కున మెరువలేదు. అదే ఆ కారులో వచ్చిన వ్యక్తికి సంబంధించిన విషయం.

ఆలోచించి చూస్తే ఆ కారులో వున్న వ్యక్తే ఈ అమ్మాయిని ప్రేమించో, మాట యిచ్చో పాడు చేసి తప్పించుకొని దగా చేసి వుంటాడు. ఈ అవమానాన్ని తట్టుకోలేక గౌరవాన్ని సంరక్షించుకునే కుటుంబం కాబట్టి ఆమె తలిదండ్రులు వెలివేసి వుంటారు. ఆమె వాడిని ప్రాధేయపడగా తిరస్కరించి ఉంటాడు. ఆమె మనసు చలించి పిచ్చిదయింది.

ఆమె గర్భంలో పాప పెరుగుతూ వచ్చింది. తన ప్రేమకో, పాపానికో ప్రతిఫలంగా, బిడ్డను కన్నది. ఇన్ని నాళ్లకు తిరిగి తాను భర్తగా నమ్మినవాడు కనిపించినప్పుడు వాడి కారులో బిడ్డను పెట్టి పాపకు గాలి తగులుతుందని గుడ్డ చిరుగులు కట్టింది. యజమాని వచ్చి చూచుకొని ఆ అమ్మాయిని పోల్చుకున్నాడు. కాని పిచ్చిది కాబట్టి గుర్తుపట్టదని నిర్ధారించుకొని ఆ నాటకం ఆడాడు. ఇదీ కథ

తరువాత జనం పోలీసులకు ఇన్‌ఫార్మ్ చేశారు. బిడ్డను అనాధశరణాలయంలో అప్పగించారు. ఆ స్థితిలో కూడా బిడ్డను గట్టిగా పట్టుకొని ఇవ్వనన్నది. బలవంతంగా మచ్చిక చేసి ఒప్పించవలసి వచ్చింది.

ఆనాడు దానిని ఆదరించి పంపించి వేశాం. అది మళ్లా ఏమయిందో తెలియదు. ఇటువంటి పరిత్యక్తలెందరో.